


sahanamvande.com

epaper.sahanamvande.com

# సహానం వందే

హైదరాబాద్ | 05-07-2026 ఆదివారం | సంపుటి-02 సంచిక : 95 EDITOR: ROHINI




# ఓట్లపై వేటు... 16 కోట్ల ఓటర్లు ఔట్

## కేంద్ర మాజీ ఎన్నికల కమిషనర్ లావాసా విమర్శ




- ఢిల్లీలో మేధావులు, మాజీ అధికారుల ఫైర్
- ఓటర్ల జాబితాలో భారీ కుంభకోణం
- అర్హులైన వారికీ ఓట్ల గండం ఉందని ఆరోపణ
- పారదర్శకతకు తూట్లు పొడిచిన ఈసీఐ

**దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు గుండెకాయ వంటి ఓటర్ల జాబితా ఇప్పుడు ఒక పెద్ద కుంభకోణానికి నిలయంగా మారింది. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ ప్రక్రియలో ఏకంగా 16 కోట్ల మంది ఓటర్ల పేర్లు గాలిలో కలిసిపోయాయి. ఈ భారీ తొలగింపు వెనుక ఉన్న అసలు కారణం ఏమిటి? 16 కోట్ల మంది ఓటర్లు ఎలా అదృశ్యమయ్యారు? ఇంతటి ఘోర వైఫల్యానికి బాధ్యత ఎవరిది? ఇవే ప్రశ్నలు ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ సంచలనం రేపుతున్నాయి. - సహనం వందే, న్యూఢిల్లీ**

దేశ ప్రజాస్వామ్య మూలాలను కదిలించేలా... ఢిల్లీలోని కాన్ స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో శనివారం కీలక సమావేశం జరిగింది. కాన్ స్టిట్యూషనల్ కండక్ట్ గ్రూప్, గ్రూప్ ఆన్ ఫెడరలిజం అండ్ ఎలక్షన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కన్ క్లేవ్... దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అంశాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఒకేసారి ఎన్నికలు, పౌరసత్వ సవరణలు, ఎన్నికల సంఘం పనితీరుపై సమావేశంలో మాజీ బ్యూరోక్రాట్లు, న్యాయమూర్తులు, రచయితలు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

### పారదర్శకతకు పాతర వేసిన ఈసీఐ

మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా ఎన్నికల సంఘం తీరుపై నిప్పులు చెరిగారు. 16 కోట్ల మంది ఓటర్లను జాబితా నుండి తొలగించినా... అంతమందిని ఎందుకు తొలగించారో చెప్పే డేటా మాత్రం బయటకు రావడం లేదని ఆయన విమర్శించారు. కేవలం వలసల సాకు చూపి తప్పించుకుంటున్న ఎన్నికల సంఘం... అసలు ఎంతమంది అనర్హులను గుర్తించిందో స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఆయన నిలదీశారు. పారదర్శకతను గాలికి వదిలేసి రహస్యంగా ఓటర్ల పేర్లు తొలగించడం ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పుగా ఆయన అభివర్ణించారు.

### ఆర్మీ కల్నల్ భార్యకే దిక్కు లేదు

వ్యవస్థ ఎంతటి వైఫల్యానికి చేరిందో చెప్పడానికి ఒక ఆర్మీ కల్నల్ ఉదంతమే నిదర్శనం. కనీసం దేశం కోసం పనిచేసే సైనికుడి కుటుంబానికి కూడా ఓటరు జాబితాలో రక్షణ లేదని లావాసా ఎద్దేవా చేశారు. కల్నల్ భార్య పేరు జాబితా నుంచి మాయం కావడమే వ్యవస్థ నిర్వీర్యమైందని చెప్పడానికి చాలదా? కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు సామాన్యుల నుంచి ఉన్నతాధికారుల వరకు తమ ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికీ భయం పట్టుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### పారదర్శకతకు పాతర వేస్తున్న ఈసీఐ

ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం పోయిందని మాజీ న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో పారదర్శకత పాటించడంలో ఈసీఐ విఫలమైందని వారు ఆరోపించారు. ఫారం 17సి, సీసీటీవీ ఫుటేజీ, ప్రిసైడింగ్ అధికారుల డైరీలు వంటి కీలక రికార్డులను పబ్లిక్ డొమైన్ లో పెట్టాలని డిమాండ్ చేసినా ఈసీఐ వాటిని బయట పెట్టడానికి నిరాకరిస్తోందని వారు పేర్కొన్నారు. ఓటు ప్రాథమిక హక్కు అని, దానిని కాపాడటంలో ఈసీఐ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు.

### ప్రజాస్వామ్యానికి పెను ముప్పు

ఓటు హక్కు అనేది రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కు. అటువంటి హక్కును అడ్డగోలుగా తొలగిస్తూ వివరణ కూడా ఇవ్వకుండా ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు దేశ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోంది. ఇప్పటికైనా ఎన్నికల సంఘం కళ్ళు తెరిచి ఈ 16 కోట్ల ఓట్ల తొలగింపుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న చివరి నమ్మకం కూడా తుడిచిపెట్టుకుపోవడం ఖాయం.


కేంద్రం ఎన్నికల మాజీ కమిషనర్ అశోక్ లావాసా

# ఇరాన్ వీధుల్లో కన్నీటి సంద్రం

## ఖమైనీ అంతిమయాత్ర ప్రారంభం

- నివాళులర్పిస్తున్న కోట్లాది మంది
- నాలుగు రోజుల అంతిమ యాత్ర
- పవిత్ర క్షేత్రంలో అంత్యక్రియలు

**ఇరాన్ అత్యున్నత నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఆ దేశాన్ని శోకసంద్రంలో ముంచింది. ఆయన పార్థివ దేహాన్ని కడసారి చూసేందుకు ప్రజలు పోటెత్తారు. పవిత్ర క్షేత్రాల మీదుగా సాగే ఈ అంతిమయాత్ర దేశ చరిత్రలోనే అతిపెద్దదిగా నిలవనుంది. లక్షలాది మంది ప్రజల కన్నీటి వీడ్కోలు మధ్య ఆయన ప్రస్థానం సాగుతోంది. ఇరాన్ గడ్డపై మొదలైన ఈ భావోద్వేగ ఘట్టం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. - సహనం వందే, ఇరాన్**



ఇరాన్ దేశమంతా ఇప్పుడు శోకసంద్రమైంది. ఆయతుల్లా ఖమైనీకి నివాళులర్పించేందుకు జనం తరలివచ్చారు. శనివారం నుంచే అధికారికంగా సంతాప దినాలు మొదలయ్యాయి. ఆయన పార్థివ దేహాన్ని దర్గాగా తరలించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. రోడ్లన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి. ప్రజల కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ఆయన నాయకత్వాన్ని స్మరించుకుంటూ ప్రజలు నివాళులర్పిస్తున్నారు.

### పవిత్ర క్షేత్రాల్లో యాత్ర

ఈ అంతిమయాత్ర 4 రోజుల పాటు కొనసాగుతుంది. షియా ఇస్లాం మతంలోని అత్యంత పవిత్రమైన క్షేత్రాల మీదుగా ఈ యాత్ర సాగుతుంది. ప్రతి క్షేత్రం వద్ద ప్రజలు ఆయనకు నివాళులర్పిస్తారు. మతపరమైన ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాల గుండా ఆయన పయనం కొనసాగుతుంది. ఈ యాత్ర కోసం అధికారులు ప్రత్యేక భద్రత కల్పించారు. భక్తులు, ప్రజల సందోహం మధ్య ఆయన చివరి ప్రయాణం మొదలైంది.

### చారిత్రక ఘట్టం

ఈ అంతిమయాత్రలో కోట్లాది మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఇరాన్ గడ్డపై ఇంతటి భారీ జనసందోహం గతంలో ఎప్పుడూ చూడలేదు. ప్రతి నగరం నుండి జనం తరలివస్తున్నారు. వాహనాల కన్నా ప్రజలే ఎక్కువగా కనిపిస్తున్నారు. భద్రతా బలగాలు పరిస్థితిని అదుపులో ఉంచుతున్నాయి. ఆయన పట్ల ప్రజలకు ఉన్న గౌరవం ఈ యాత్ర ద్వారా ప్రతిబింబిస్తోంది.

### భారీ భద్రతా ఏర్పాట్లు

4 రోజుల పాటు సాగే ఈ ప్రక్రియ చాలా కీలకమైనది. అడుగడుగునా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుకోని సంఘటనలు జరగకుండా నిఘా పెంచారు. వాహనాల రాకపోకలను నియంత్రించారు. ప్రజలు ఒకే చోట గుమిగూడకుండా చర్యలు తీసుకున్నారు. అధికారుల పర్యవేక్షణలో యాత్ర పకడ్బందీగా సాగుతోంది. ఏ చిన్న పొరపాటు జరగకుండా యంత్రాంగం జాగ్రత్త పడుతోంది.

### భావోద్వేగాల ప్రవాహం

వీధుల్లో జనం నినాదాలు చేస్తున్నారు. ఖమైనీ చిత్రపటాలను చేతబూని రోడ్లపైకి వచ్చారు. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అంతా కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆ దేశ సంస్కృతిలో ఈ అంతిమ యాత్ర ఒక భాగంగా మారింది. మతపరమైన ఆచారాలతో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆయనకు నివాళులు అర్పించేందుకు ఆరాటపడుతున్నారు.

### అంత్యక్రియలు దిశగా...

4 రోజుల అనంతరం అంత్యక్రియలు ముగుస్తాయి. అప్పటివరకు ఇరాన్ వీధులు నిశ్శబ్దంతో, కన్నీటితో నిండి ఉంటాయి. ఆయన కీర్తిని చాటిచెప్పేలా ఈ అంతిమయాత్ర చరిత్రలో నిలిచిపోనుంది. ప్రపంచం మొత్తం ఇరాన్ వైపు చూస్తోంది. లక్షలాది మంది హాజరు కావడంతో పవిత్ర క్షేత్రాలు కిటకిటలాడుతున్నాయి. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ఇరాన్ ప్రజలు వీడ్కోలు పలుకుతున్నారు.

# అయోధ్యలో వెండి ఇటుకల మాయాజాలం

## రామ మందిరంలో మాయమైన నిధులు

- అందని లెక్కలు... చందాల పేరుతో దోపిడీ
- బయటపడ్డ అక్రమాలు... పైపైన చర్యలు
- పెద్ద వారిని తప్పించి చిన్న వారిపై యాక్షన్
- మౌనంగా ఉన్న అధికార యంత్రాంగం

**దైవకార్యం పేరుతో భక్తులు అర్పించిన కానుకలు ఇప్పుడు కనుమరుగవుతున్నాయి. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం సమర్పించిన వెండి ఇటుకల నుంచి నగదు వరకు ఏవీ నేడు లెక్కల్లో లేవు. ఆస్థానంలో సాగిన నిధుల సేకరణ వ్యవస్థ, ఆ తరువాత వెలుగులోకి వచ్చిన అవినీతి బాగోతం భక్తుల నమ్మకాన్ని వమ్ము చేస్తోంది. మందిరం పవిత్రతను కాపాడాల్సిన వారు అక్రమాలకు పాల్పడి సంపదను పోగేసుకున్న తీరు ఇప్పుడు దేశాన్ని నిశ్చేష్టులను చేస్తోంది. - సహనం వందే, అయోధ్య**



పుణెకు చెందిన సింధీ సమాజ సభ్యులు 210 వెండి ఇటుకలను విరాళంగా ఇచ్చారు. వీటి విలువ సుమారు 2 కోట్లుగా ఉంటుంది. ప్రతి ఇటుక ఒక కిలో బరువు కలిగి ఉండేది. వీటిని ట్రస్టు జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్‌కు అప్పగించారు. అయితే వీరికి ఎటువంటి రసీదు ఇవ్వలేదు. క్వాలిటీ చెకింగ్ పేరిట కాలయాపన చేశారు. ఐదేళు గడిచినా ఆ వెండి ఇటుకలు ఎక్కడికి వెళ్ళాయో ఎవరికీ తెలియదు. అప్పగించిన కానుకల జాడ కూడా లేకపోవడం పెద్ద వివాదంగా మారింది.

### నిధుల సేకరణలో వ్యవస్థీకృత దోపిడీ

మందిరంలోని 35 డొనేషన్ బాక్సుల ద్వారా నిధులు సేకరిస్తారు. వీటిని 200 మీటర్ల దూరంలోని కౌంటింగ్ రూమ్ కి తరలిస్తారు. రోజూ 8 నుంచి 13 లక్షల రూపాయల వరకు వసూలవుతుంటుంది. కొన్ని రోజుల్లో ఇది 60 లక్షల వరకు వెళ్తుంది. ఈ ప్రక్రియలో ప్రైవేట్ ఏజెన్సీలు, ట్రస్టు సిబ్బంది కలిసి పని చేస్తారు. నోట్ల కట్టలను లెక్కించేటప్పుడు 10 కట్టలకు బదులుగా 12 నుండి 13 కట్టలను లెక్కించి మిగిలిన వాటిని కాజేసేవారని అకౌంట్ ఇంచార్జి మహిపాల్ సింగ్ బయటపెట్టారు.

### అక్రమ ఆస్తుల వెనుక దాగి ఉన్న నిజాలు

కౌంటింగ్ సిబ్బందిగా పనిచేసిన వారిలో లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ మిశ్రా, కేడీ తివారీ, టిన్ను యాదవ్ వంటి వారు ఉన్నారు. ఒకప్పుడు కారు మెకానిక్ గా ఉన్న లవ్‌కుష్ ఇంట్లో లక్ష రూపాయలు దొరకగా, కేడీ తివారీ 5 కోట్ల పైగా ఆస్తులు సంపాదించారు. టిన్ను యాదవ్ 50 కోట్ల విలువైన ఆస్తులను కూడగట్టారు. బ్యాంకులు సైతం ముందే హెచ్చరించినా ట్రస్టులోని కొందరు పెద్దలు ఈ అక్రమాలను అడ్డుకోకపోగా ప్రశ్నించిన వారిని విధుల నుంచి తొలగించారు.

### భూముల కొనుగోలులో భారీ కుంభకోణం

మందిర నిర్మాణ సమయంలో భూమి కొనుగోళ్లలో తీవ్రమైన అవకతవకలు జరిగాయి. రెండు కోట్లకు కొన్న భూమిని కేవలం 10 నిమిషాల్లోనే 18.5 కోట్ల రూపాయలకు ట్రస్టుకు అమ్మిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్ల పేమెంట్లలో కూడా 40 శాతం వరకు కమిషన్లు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా చంపత్ రాయ్ కనుసన్నల్లోనే జరిగిందని, ఆయన బంధువు ఒకరు ఈ అక్రమాల్లో కీలకంగా వ్యవహరించారని విమర్శలున్నాయి.

### మౌనంగా ఉన్న అధికార యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్టులో 15 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో నిపేంద్ర మిశ్రా, అనిల్ మిశ్రా, జ్ఞానేష్ కుమార్ వంటి వారు ఉన్నారు. వీరి పర్యవేక్షణలో ఇంత భారీ అవినీతి జరుగుతున్నా ఎవరూ స్పందించలేదు. సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్, అరవింద్ కేజ్రీవాల్ వంటి వారు నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇంటెలిజెన్స్ నివేదికలు ఉన్నా ప్రభుత్వం స్పందించక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### ప్రశ్నలకు దొరకని సమాధానం

దర్యాప్తు జరుగుతోందని చెబుతున్నప్పటికీ ప్రధాన దోషులపై చర్యలు లేవు. కేవలం చిన్నస్థాయి సిబ్బందిని అరెస్టు చేసి చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల రాజీనామాలతో వ్యవహారాన్ని ముగించే ప్రయత్నం చేశారు. అయోధ్య రామమందిరం అంటే భక్తుల నమ్మకానికి చిహ్నం. కానీ ఇక్కడ జరిగిన వ్యవహారం కేవలం నిధుల చోరీ మాత్రమే కాదు, కోట్లాది మంది భక్తుల నమ్మకాన్ని కాజేసిన ద్రోహం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పుడు దేశవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది.